క్లుప్తంగా

విద్యార్థినికి సన్మానం



మరికల్: జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా వరంగల్‌లో జరిగిన సైన్స్‌పాటల పోటీలో తీలేర్ విద్యార్థి బుజ్జమ్మ ప్రతిభ చూపడంతో గురువారం కలెక్టర్ కోయ శ్రీహర్ష అభినందించారు. కలెక్టర్ కార్యాలయంలో హెచ్‌ఎం అనురాధతోపాటు విద్యార్థిని బుజ్జమ్మ కలెక్టర్‌ను కలిశారు. సైన్స్ దినోత్సవం సందర్భంగా విద్యార్థి పాడిన పాట కలెక్టర్‌కు పాడి వినిపించడంతో ఆకట్టుకుందని హెచ్‌ఎం తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థినిని అభినందించి సన్మానించారు.

మండల టాపర్‌గా ఆకాష్



ఊట్కూరు: పూసల్ పహడ్ టాలెంట్ టెస్టులో మండల టాపర్‌గా ఆకాశ్ ప్రతిభ హెచ్‌ఎం సురేష్ తెలిపారు. ఈ నెల 11న శేర్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పూసల్ పహడ్ టాలెంట్ టెస్టును జిల్లాలో నిర్వహించారు. 150 మార్కులకు గాను మండలంలోని బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి అకాష్ 97మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచాడు. పాఠశాల విద్యార్థి ప్రతిభ కనబరచడంతో ఉపాధ్యాయ బృందం తదితరులు విద్యార్థిని అభినందించారు.

అయ్యప్పకు అభినందన



మరికల్: రష్యాలో జరిగే ప్రపంచ యువజన సదస్సుకు భారత్ తరఫున మరికల్‌కు చెందిన న్యాయవాది అయ్యప్ప ఎంపిక కావడంతో గురువారం హైదరాబాద్‌లో ఎంపీ బండి సంజయ్ అయ్యప్పను అభినందించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని భారతదేశం యొక్క ఔన్నత్యాన్ని గొప్పగా చెప్పాలని అయ్యప్పకు సూచించారు.

చలివేంద్రం ప్రారంభం



మరికల్: మండల కేంద్రంలోని రాయిచూర్ రోడ్డు పక్కన మణికంఠ ట్రేడర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని గురువారం ఎస్‌ఐ మురళీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ వేసవితాపం తాళలేక వస్తున్న బాటసారులకు, శ్రీశైలం వెళ్తున్న భక్తులకు నీటిదాహం తీర్చడం కోసం చలివేంద్రం ఏర్పాటుచేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మణికంఠ ట్రేడర్స్ యజమాని ముకుందరెడ్డి, రాజేష్, రవి, శేఖర్, కృష్ణ చైతన్య, సింహాచలం పాల్గొన్నారు.

'నిలువురాళ్లు' సంచిక విడుదల



కృష్ణా: ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ముడమాల్ నిలువురాళ్ల సంచికను గురువారం ముడుమాల్ పాఠశాలలో గ్రామ ప్రముఖులతో ఉపాధ్యాయులు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు క్ష్మీనారాయణ, సీఆర్‌పీలు రమేష్‌గౌడ్, అమీన్‌రెడ్డి మండలంలోని వివిధ శాఖల అధికారులకు సంచికను అందజేసి వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ, సీఆర్‌పీలు రమేష్‌గౌడ్, అమీన్‌రెడ్డి, గ్రామ మాజీ సర్పంచ్ తాయమ్మ, నాయకులు వెంకటేష్, హనీఫ్, హన్మిరెడ్డి, రఘు తదితరులు పాల్గొన్నారు.

టీజీటీలో ఎంపిక



శ్రీవిద్యా

ధన్వాడ: మండలంలోని గున్ముక్ల గ్రామానికి చెందిన శ్రీ విద్యా గురువారం విడుదలైన గురుకుల టీజీటీలో ఎంపికైంది. గ్రామ నుంచి ప్రభుత్వ ఉద్యోగం సాధించడంపై గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

నాలుగేళ్ల సంబరం ఒకే సారి



మక్తల్: కోలాహలంగా నాలుగేళ్ల సంబరం ఒకేసారి చేసుకుని సంబరపడ్డారు. గత లీపు సంవత్సరం 2020లో మండలంలోని ముస్టిపల్లిలో శ్రీతాన్‌సాయి, ఆర్యన్ బంధుమిత్రుల మధ్య జన్మదినాన్ని ఘనంగా నిర్వహించారు. గురువారం కుటుంబసభ్యులంతా నాలుగేళ్ల మొదటి సంవత్సర జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

వీడని మూఢనమ్మకం

- జిల్లాలో విచ్చలవిడిగా మాయగాళ్ల ఆగడాలు
- మంత్రాలు, మాయల పేరుతో అమాయకుల బురిడీ
- తాజాగా జిల్లా కేంద్రంలో క్షుద్రపూజల అలజడి
- చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం





జిల్లా కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో షాపునకు కట్టిన క్షుద్రపూజల సామగ్రి

సాక్షి, నాగర్‌కర్నూల్: ఆధునిక సాంకేతికత కొత్త పుంతలు తొక్కుతున్నా.. జిల్లాలోని పలుచోట్ల ఇప్పటికీ మూఢనమ్మకాల జాఢ్యం వీడటం లేదు. మాయలు, మంత్రాలు, గుప్తనిధులపై ఆశతో అమాయకులు మంత్రగాళ్లను ఆశ్రయిస్తున్నారు. నేటికీ మంత్రాలతో సమస్యలు పరిష్కరిస్తామంటూ కొంత మంది మాయగాళ్ల దందా జిల్లా వ్యాప్తంగా జోరుగా సాగుతోంది. ప్రజలకు అవగాహన కల్పిస్తూ.. మంత్రగాళ్లు, మోసగాళ్ల ఆగడాలను కట్టడి చేయాల్సిన పోలీస్‌శాఖ పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మంత్రాలు, మాయల పేరుతో గుప్తనిధులు వెలికి తీస్తానంటూ జిల్లా కేంద్రానికి చెందిన సత్యనారాయణ యాదవ్ ఏకంగా 11 మందిని పొట్టనబెట్టుకున్న ఉదంతం ఇటీవల వెలుగుచూసింది. నిందితుడు సత్యనారాయణ యాదవ్‌కు సహకరించిన పోలీస్ అధికారి హన్మంతును ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. అయితే నాలుగేళ్ల కిందట నాగాపూర్ ఘటన చోటుచేసుకోగా.. అప్పుడే నిందితుడిని అదుపులోకి తీసుకుని ఉంటే మిగితావారి ప్రాణాలు దక్కేవన్న అభిప్రాయం వ్యక్తమైంది. తాజాగా జిల్లాకేంద్రంలోని బస్టాండ్ ఎదురుగా అర్ధ రాత్రి క్షుద్రపూజల ఉదంతం కలకలం రేపుతోంది.

అందినకాడికి దోచుకుంటున్నారు..

జిల్లా నలుమూలలా మంత్రాలు, నాటువైద్యం పేరుతో మోసాలకు పాల్పడుతున్న మాయగాళ్ల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. అమాయకులే లక్ష్యంగా చేసుకుని మాయగాళ్లు అందినకాడికి దోచుకుంటున్నారు. జిల్లా కేంద్రంలో పిల్లలు అనారోగ్యానికి గురైతే తాయత్తులు, బిల్లలు కడుతామంటూ రోజుకొకరు చొప్పున మాయగాళ్లు పుట్టుకొస్తున్నారు. మాయలు, మంత్రాలను నమ్ముతూ వారిని ఆశ్రయించే జనం సంఖ్య సైతం ఎక్కువగా ఉంటోంది. అడ్డగోలుగా దందా సాగిస్తూ విచ్చలవిడిగా మాయలకు పాల్పడుతున్నా.. సంబంధిత పోలీస్ అధికారులు చోద్యం చూస్తుండటం విమర్శలకు తావిస్తోంది. నిందితులపై ఫిర్యాదు చేసేందుకు బాధితులు ముందుకొచ్చినా, అధికారులు వారిపై చర్యలు తీసుకోకపోవడంతో పాటు నిందితులకే సహకరించిన ఉదంతం జిల్లాలో చోటుచేసుకుంది. జిల్లా వ్యాప్తంగా మూఢనమ్మకాలపై క్షేత్రస్థాయిలో అవగాహన కరువైందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

జిల్లా కేంద్రంలో క్షుద్రపూజల అలజడి..

జిల్లా కేంద్రం నడిబొడ్డున బస్టాండ్ ఎదురుగా క్షుద్రపూజలకు పాల్పడ్డారంటూ బాధితులు పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించిన ఉదంతం ఆలస్యంగా వెలుగు చూసింది. గత నెల 26న బస్టాండ్ ఎదురుగా ఉన్న పూల దుకాణంతో పాటు పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న ఫర్నీచర్ షాపు ఎదురుగా క్షుద్రపూజల సామగ్రిని వేశారని బాధితుడు ఖాదర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సోమవారం తెల్లవారుజామున తన షాపు ఎదుట ఉంచిన ప్లాస్టిక్ కవర్లో నిమ్మకాయ, పసుపు, కుంకుమ, కొబ్బరికాయ, కోడి

> **నిందితులను రిమాండ్‌కు తరలించాం..**
>
> జిల్లా కేంద్రంలో క్షుద్రపూజలకు పాల్పడిన ముగ్గురిపై కేసు నమోదు చేశాం. వీరిలో ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించాం. మరో వ్యక్తి ఖాజాఖాన్ పరారీలో ఉన్నాడు. పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం. మూఢ నమ్మకాలపై ప్రజలను చైతన్యం చేసే కార్యక్రమాలను కొనసాగిస్తున్నాం.
>
> – శ్రీనివాస్, డీఎస్పీ, నాగర్‌కర్నూల్

కాలు, దుస్తులు, కర్రతో కూడిన ఫొటో ఫ్రేమ్ తదితర వస్తువులు ఉన్నాయని ఫిర్యాదులో పేర్కొన్నాడు. సీసీ కెమెరాల్లో నమోదైన దృశ్యాల ఆధారంగా పోలీసులు లింగాలకు చెందిన ఇనాయత్, జిల్లా కేంద్రానికి చెందిన మొయిన్‌ను అదుపులోకి తీసుకున్నారు. రాజకీయ కక్షల నేపథ్యంలో జిల్లా కేంద్రానికి చెందిన కౌన్సిలర్ ఖాజాఖాన్ వీరిని పురమాయించినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. జిల్లా కేంద్రంతో పాటు పలుచోట్ల మాయలు, మంత్రాల పేరుతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న మాయగాళ్ల సంఖ్య క్రమంగా పెరుగుతోంది.

అడుగడుగునా తవ్వకాలు..

జిల్లాలోని పురాతన ఆలయాలు, నల్లమల పరిసర ప్రాంతాల్లో ఆలయాల్లో గుప్తనిధుల తవ్వకాలు నిత్యకృత్యంగా మారింది. ఎప్పుడు ఏదో ఒక చోట గుప్తనిధుల తవ్వకాలు వెలికి చూస్తున్నాయి. ఇప్పటికే నల్లమలలోని ప్రతాపరుద్రుని కోట, రాయలగండి చెన్నకేశవ ఆలయం, నవ నరసింహ ఆలయం, బైరాపూర్ ఆలయం, వడ్డెమాన్‌లోని త్రికూట ఆలయం, కాళికామాత ఆలయం తదితర చోట్ల తవ్వకాలు జరిపి శిల్పాలను ధ్వంసం చేశారు. అమూల్యమైన పురాతన ఆలయాలు, శిల్పాలను సంరక్షించాల్సిన సంబంధిత అధికారులు తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫలితంగా అరుదైన శిల్పాలు, పురాతన ఆలయాల గుప్తనిధుల తవ్వకాలు జరిపే వారి బారిన పడి ధ్వంసమవుతున్నాయి.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



కోటకొండలో నృత్యాలు చేస్తున్న చిన్నారులు

నారాయణపేట రూరల్: మండలంలోని కోటకొండ జెడ్పీస్కూల్‌లో బుధవారం రాత్రి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో అలరించాయి. పాఠశాల వార్షికోత్సవంలో భాగంగా విద్యార్థులు చక్కటి వేశాధారణతో దేశభక్తి, దైవభక్తి పాటలకు నృత్యాలు చేశారు. రైతు, సైనికుడి ప్రాధాన్యతతో చేపట్టిన నాటికలు అలరించాయి. అంతకుముందు ముఖ్యఅతిథిగా హాజరైన డీఈఓ ఎండీ అబ్దుల్ ఘనీ మాట్లాడుతూ.. చదువుతోపాటు క్రమశిక్షణ అలవర్చుకోవాలన్నారు. టెన్త్ పరీక్షల్లో చక్కటి జీపీఏ సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రవికుమార్, తపస్ జిల్లా అధ్యక్షుడు శేర్‌కృష్ణారెడ్డి, పీఆర్టీయూ జిల్లా సెక్రెటరీ జనార్ధన్ రెడ్డి, రఘువీర్, వివిధ పార్టీల నాయకులు కెంచె శ్రీనివాస్, రాము, కాశీనాథ్, బలరాం, విజయలక్ష్మి, ఎంపీటీసీ సునీత పాల్గొన్నారు.

బాలల హక్కులు కాపాడాలి..



అవగాహన కల్పిస్తున్న నర్సింహులు

మాగనూర్: బాలల హక్కులను కాపాడాలని చైల్డ్ హెల్ప్‌లైన్ డిస్ట్రిక్ కో ఆర్డినేటర్ నర్సింహులు అన్నారు. గురువారం మండలంలోని వడ్వాట్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన నిర్వహించారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడుతూ.. పిల్లలకు స్వేచ్ఛ, అభివృద్ధి అనే బాలల హక్కులను కాపాడడానికి నారాయణపేట్ బాల రక్షక్ భవన్ ఉందని తెలిపారు. ప్రతి ఒక్కరూ చదువుకు దూరం కాకుండా బడీఈడు పిల్లలు బడిలో ఉండేవిధంగా చూడాలన్నారు. చిన్న వయస్సులోనే చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహాపడిపూజ



జ్యోతిర్లింగాలకు పూజలు చేస్తున్న శివభక్తులు

మక్తల్: మండలంలోని జక్లేర్‌లో శివస్వాములు మహాపడిపూజ కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు.. గ్రామంలోని పురవీధుల గుండా కలశంతో ఊరేగింపుగా వెళ్లారు. అనంతరం భక్తులు జ్యోతిర్లింగాలకు పూజలు చేశారు. ఈమేరకు.. ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. శివస్వాములు ఆలపించిన భక్తి సంకీర్తనలు పలువురిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ లక్ష్మారెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ నర్సింహాగౌడ్, మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, చంద్రకాంత్‌గౌడ్, రాజుల ఆశిరెడ్డి, వివిధ గ్రామాల నుంచి శివస్వాములు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించండి



ఎంపీఓకు వినతిపత్రం అందిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

అమరచింత: ఖాళీగా ఉన్న వాటితో పాటు కొత్త జీపీల్లో ఫీల్డ్ అసిస్టెంట్ల నియామకాలు వేగంగా చేపట్టాలని డిమాండ్‌చేస్తూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గురువారం ఎంపీఓ నరసింహులుకు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అజయ్ మాట్లాడుతూ ధర్మాపురం, చంద్రప్పతండా, చింతరెడ్డిపల్లి, కిష్టంపల్లి కొత్త గ్రామ పంచాయతీల్లో సీనియర్ మేట్లుగా పనిచేస్తున్న వారిని ఫీల్డ్ అసిస్టెంట్లుగా నియమించాలని కోరారు. నాగల్‌కడ్మూర్, సింగంపేట, ఈర్లదిన్నె, మస్తీపురం, మిట్టనందిమళ్ల గ్రామాల్లో ఖాళీగా ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్ల నియామకాలను వెంటనే భర్తీ చేయాలన్నారు. గత ప్రభుత్వం ఫీల్డ్ అసిస్టెంట్ల నియామకాలు చేపట్టలేదని, కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఖాళీగా ఉన్న వాటిని భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శంకర్, బెక్కం కురుమన్న, నిశాంత్, బాలస్వామి, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీక రాజావళి ఉర్సు

అమరచింత: పట్టణంలో రాజావళి దర్గా ఉర్సు మార్చి 1 నుంచి 3 వరకు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. 1న గంధోత్సవం, 2న తాజీ చిరాక్, 3న ఖత్మేఖురాన్ ఉత్సవాలు ముగుస్తాయన్నారు. ఉర్సు సందర్భంగా చాదర్ ఊరేగింపుతో పాటు ఆల్‌ఇండియా కృష్ణ, మహేష్ బాబు అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు ఖాదర్ గోరి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్యాడ్ల పంపిణీ



ధన్వాడ: మండలంలోని గోటూర్‌లో విద్యార్థులకు రాజీవ్ గాంధీ ఫౌండేష్ ఆధ్వర్యంలో పదోతరగతి విద్యార్థులకు యువజన కాంగ్రెస్ నాయకులు ఉచితంగా ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. విద్యార్థులు పరీక్షలు బాగా రాసి ఉత్తమ మార్కుల సాధించాలని మాజీ ఉపసర్పంచ్ వెంకట్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో నమరసింహారెడ్డి, మురళీగౌడ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తు

మాగనూర్: ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు గురువారం మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రశాంతంగా ప్రారంభమైనట్లు సీఎస్ రామస్వామి తెలిపారు. మొదటి రోజు 112 మందికిగాను 109మంది హాజరు కాగా 03మంది గైర్హాజరయ్యారు. పరీక్షల సందర్భంగా 144 సెక్షన్ అమలులో ఉండటంతో కేంద్రం పరిసరాల్లో పోలీసులు పెట్రోలింగ్ చేశారు.

నేటి నుంచి గాలికుంటు నివారణ టీకాల పంపిణీ

మాగనూర్: మండల వ్యాప్తంగా శుక్రవారం నుంచి పశువులకు గాలికుంటు నివారణ టీకాలు పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పంపిణీ చేయనున్నట్లు వెటర్నరీ అసిస్టెంట్ వినయ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 16 గ్రామ పంచాయతీల పరిధిలో మార్చి 01 నుంచి 20 వరకు పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయనున్నట్లు, ఈ అవకాశాన్ని పశువుల కాపరులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నర్సరీల పరిశీలన

మద్దూర్: మండల పరిధిలోని పలు గ్రామ పంచాయతీలను గురువారం ఎంపీడీఓ జయరాములు, ఏపీఓ సిద్దేశ్వర్‌తో కలిసి తనిఖీలు చేశారు. ఉపాధిహామీ పథకంలో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణాలతోపాటు పంచాయతీ రికార్డులను పరిశీలించారు. హన్మానాయక్ తాండ, జాదరావుపల్లి తాండలలో పర్యటించారు. అంగన్‌వాడీ కేంద్రాలను, నర్సరీలను తనిఖీచేసి నర్సరీలో వందశాతం మొక్కల పెరుగుదలకు కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఈజీఎస్ సీసీ, ఆయా గ్రామ పంచాతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేద్దాం

నర్వ: ఉమ్మడి జిల్లాలోని గౌడ్‌ల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేద్దామని మండల గౌడ సంఘం నాయకులు లక్ష్మణ్‌గౌడ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మహబూబ్‌నగర్‌లోని భూత్పూర్ రోడ్‌లో ఏఎస్‌ఎన్ గార్డెన్‌లో ఆదివారం ఉదయం 10 : గంటలకు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర రవాణశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, జిల్లాలోని ఎమ్మెల్యేలు హాజరవుతున్నారన్నారు. ఈ సమావేశానికి మండలంలోని అన్ని గ్రామాల నుంచి గౌడ్ సోదరులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

ఘనంగా దత్తాత్రేయ ఆలయ వార్షికోత్సవ పూజలు



మంగళహారతులు ఇస్తున్న మహిళలు

మరికల్: మండల కేంద్రంలోని దత్తాత్రేయ కాలనీలో దత్తాత్రేయ ఆలయ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీఠాధిపతి కృష్ణగురుస్వామి ఆధ్వర్యంలో స్వామి వారికి అభిషేకం, హోమం, ఊయల పాటలు నిర్వహించారు. అంతకుముందు గ్రామంలోని మహిళలు మంగళహారతులతో ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేసి మంగళహారతులు ఇచ్చారు. అనంతరం అఖండభజన కార్యక్రమంలో నిర్వహించి గ్రామస్తులకు తీర్థప్రసాదలతోపాటు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యం పెంచాలి



ఉపాధ్యాయులకు సూచనలు ఇస్తున్న నోడల్ అధికారి

కృష్ణా: మండలంలోని హిందుపూర్ ప్రాథమికొన్నత పాఠశాలను గురువారం మండల నోడల్ అధికారి నిజాముద్దీన్ సందర్శించి ఉపాధ్యాయులకు తగు సూచనలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మెరుగుపర్చేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలని కోరారు. అనంతరం బోధనతీరు, చదవడం, రాయడంతోపాటు మధ్యాహ్నభోజనం, విద్యార్థుల హాజరు తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో ఆ పాఠశాల హెచ్‌ఎం మీరా కులకర్ణి, ఉపాధ్యాయులు అజయ్, హనుమదాసు, ప్రశాంతి కుమారి, కస్తూరి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా సామగ్రి పంపిణీ



క్రీడా సామగ్రి పంపిణీ చేస్తున్న ఎన్ఆర్ఐ ఫౌండేషన్ ప్రతినిధులు

కోస్గి: గుండుమాల్ మండల పరిధిలోని బోగారం జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అమెరికాలో స్థిరపడిన ఎన్ఆర్ఐలు ఏర్పాటుచేసిన ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రీడా సామాగ్రి పంపిణీ చేశారు. వనపర్తికి చెందిన రవి ప్రకాష్ అమెరికాలో స్థిరపడి అక్కడే ఎన్ఆర్ఐ ఫౌండేషన్ ఏర్పాటుచేసి స్వదేశంలో పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో ఎంపిక చేసిన గ్రామాల్లో పర్యటించి తమ సేవా కార్యక్రమాలను చేపడుతున్నారు. ఈ క్రమంలో గురువారం గుండుమాల్ మండల పరిధిలోని బోగారం గ్రామాన్ని సందర్శించి పాఠశాలలో విద్యార్థులకు క్రీడా సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సత్యనారాయణతోపాటు ఎన్ఆర్ఐ ఫౌండేషన్ ప్రతినిధులు, ఉపాధ్యాయ బందం తదిరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మక్తల్: ఎమ్మార్పీఎస్ జిల్లా నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా శంకరప్ప, ఇన్‌చార్జిగా వెంకటేష్, కృష్ణయ్య, పేట ఇన్‌చార్జి ఎల్ శేఖరయ్యను ఎన్నుకున్నారు. ఈ కార్యవర్గం ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అనంతరం మహబూబ్‌నగర్ పార్లమెంటరీ ఇన్‌చార్జి జంబులయ్య ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు.. ఎస్సీ వర్గీకరణకోసం 30ఏళ్లనుంచి పోరాటం చేసిన తమ సమస్యలను పరిష్కారం కావడంలేదని, కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి సమస్యను పరిష్కరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో అధ్యక్షుడు మల్లెపోగు శ్రీనివాస్, జయన్న, బాలప్ప, గోపాల్, రాజు, నర్సింహులు, బాల్‌రాజ్, నర్సింహ తదిరులు పాల్గొన్నారు.

బీఐఎస్ పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థులతో నిర్వాహకులు

కోస్గి: బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్, కేంద్ర ప్రభుత్వ వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, ప్రజా పంపిణీ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో గురువారం స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించే నిమిత్తం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. బీఐఎస్ ప్రమాణాలపై నిర్వహించిన ఈ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులతో పాటు ప్రశంస పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో బీఐఎస్ మెంబర్లు కవిలత, జయశ్రీ, కళాశాల ప్రిన్సిపల్ పరమేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

హక్కులపై అవగాహన కలిగి ఉండాలి



నారయణపేట మండలం బోయిన్‌పల్లిలో మాట్లాడుతున్న అధికారులు



కృష్ణాలో మాట్లాడుతున్న తహసీల్దార్ దయాకర్‌రెడ్డి



మాగనూర్‌లో..

నారాయణపేట రూరల్: ప్రజలు హక్కులపై అవగాహన కలిగి ఉండాలని అధికారులు అన్నారు. ప్రతి నెల ఆఖరిరోజు జిల్లాలో సివిల్‌రైట్స్ డే నిర్వహించాలనే ఆదేశాలతో జిల్లాలోని ప్రతి పీఎస్ పరిధిలో ఒక గ్రామం ఎంపిక చేసి గురువారం కార్యక్రమం నిర్వహించారు. ఈమేరకు పోలీసులు ఆయా గ్రామాలకు వెళ్లి ప్రజలను చైతన్య పరిచారు. ఈ సందర్భంగా వివిధ శాఖల జిల్లా, మండల అధికారులు, సంబంధిత పీఎస్‌ల ఎస్‌ఐ, ఏఎస్‌ఐలు పాల్గొని మాట్లాడారు. ప్రతీ పౌరుడికి సమానత్వం, స్వేచ్ఛగా జీవించే అవకాశాన్ని రాజ్యాంగం కల్పించిందన్నారు. బీద, ధనిక తేడా లేకుండా అందరు సమానంగా సేవలను పొందవచ్చని చెప్పారు. ఆయా కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, పోలీసులు పాల్గొన్నారు.

మాగనూర్: మండలంలోని కొత్తపల్లిలో గురువారం పోలీసులు, రెవెన్యూ అధికారులు సివిల్ రైటర్స్ డే కార్యక్రమాన్ని నిర్వాహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు.. గ్రామస్తులకు తమ యొక్క హక్కుల గురించి వివరించారు. ప్రతీ పౌరుడికి సమానత్వం, స్వేచ్ఛగా జీవించే అవకాశాన్ని రాజ్యాంగం కల్పించిందన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ ఆర్‌ఐ శ్రీశైలం, ఏఎస్‌ఐ మన్నన్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా: మండలంలోని తంగిడిలో గురువారం పౌర హక్కుల వినియోగంపై ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ దయాకర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి నెల ఆఖరిరోజు జిల్లాలో సివిల్‌రైట్స్ డే నిర్వహించాలనే ఆదేశాలతో కార్యక్రమం నిర్వహించారు. ఈమేరకు వారు మాట్లాడుతూ.. ప్రతి పౌరుడు రాజ్యంగం కల్పించిన తమహక్కులను ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఐ సురేంద్రబాబు, గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఊట్కూరు: గ్రామాల్లో అంటరానితనాన్ని పాటించొద్దని ఆర్‌ఐ శ్రావణ్‌కుమార్ కోరారు. గురువారం మండలంలోని మల్లేపల్లిలో పౌరహక్కుల దినాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో గ్రామస్తులందరూ కులమతాలకు అతీతంగా గ్రామాభివృద్ధికి పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో పోలీస్ కానిస్టేబుల్ రామాంజనేయులు, భాను, గ్రామస్తులు హన్మంతు, వెంకటప్ప పాల్గొన్నారు.

శ్రీశైలానికి శివస్వాముల పాదయాత్ర



ఇరుముడి కట్టించుకుంటున్న శివస్వాములు

నారాయణపేట రూరల్ : పట్టణంలోని నారాయణ స్వామి దేవాలయం నుంచి పలువురు శివమాలాధారులు గురువారం శ్రీశైలం బయలుదేరి వెళ్లారు. ఉదయం ఆలయంలో స్వామివారికి పంచామృతాభిషేకం, బిల్వార్చన, మహామంగళహారతి కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం గురుస్వాముల ఆధ్వర్యంలో ఇరుముడి కట్టుకుని పాదయాత్ర మొదలుపెట్టారు. వీరికి పలువురు కుటుంబ సభ్యులు బాజాభజంత్రీలు, మంగళహారతులతో ఊరేగింపుగా వెళ్లి వీడ్కోలు పలికారు.